**రోజూలాగే** ఆ రోజు కూడా క్యాంటీన్‌లో టిఫిను, కాఫీ అయ్యాక వేప చెట్టు కింద జరిగే లోకాభి రామాయణం వింటున్నాను. రాజకీయాలు, సినిమాల మీద కబుర్లు జోరుగా సాగుతున్నాయి.

ఒక పావు గంట తరువాత ఎవరో నా చేయి పట్టుకొని పక్కకు పిలిచారు.

"నన్ను గుర్తు పట్టారా?" ప్రశ్నించాడు ఒక పెద్దమనిషి.

లేదన్నట్టు తలూపాను.

"నా పేరు సాంబశివరావు . . . డివిజనల్ ఆఫీసులో హెడ్ క్లార్కుని." గుర్తు చేశాడు. కొంచెంసేపు ఆలోచించాను.

తర్వాత గుర్తుకొచ్చిన విషయం—పదిహేనేళ్ళ క్రితం నేను వాళ్ళాఫీసులో మూతిళ్ళు పని చేశాను. ఆ తర్వాత ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలోకి మారాను. అప్పట్లో ఆయన వేరే సబ్—డివిజనుల్లో పని చేయుటంవల్ల ఎప్పుడూ చూడటం జరగలేదు, ఏ మూడు నాలుగుసార్లో తప్పించి.

ఇద్దరం క్యాంటీనువైపు నడిచాం.

టిఫిను, కాఫీలయ్యాక మా మధ్య కబుర్లు చాలాసేపు సాగాయి.

ఎంతోసేపట్నుంచీ నేను అభిమానించి, ప్రేమించే ఒక వ్యక్తిని గురించి అడగాలని ఉంది. . .ఆయనేమను కుంటాడో? ఏవో సందేహాలు. . .అనుమానాలు.

ఇంతలో తను వచ్చిన పని వివరించాడు.

అప్పటి నా స్నేహితులు తెలిసినవారిని గురించి అడగడం ప్రారంభించాను. సాంబశివరావు ఎంతో ఆదరంగా బదులిచ్చాడు.

చివరకు నా అభిమానిని గురించి అడిగేందుకు నిశ్చయించుకొన్నాను. మరోలా అనుకునే వ్యక్తి కాదని అనిపించింది.

"మీకు అన్నపూర్ణ తెలుసా?" అడిగాను.

"తెలియకేం? ప్రస్తుతం నా సెక్షన్లోనే ఉంది. బాగా పని చేస్తుంది. ఆఫీసులో మిగిలిన ఆడవాళ్ళందరికంటే ఆవిడ ఎంతో నయం. ఎంతో మెచ్చుకున్నారు." ఆయన చెపుతున్నాడు.

మా పరిచయం గురించి కొంచెం వివరించాను.

"మేము ఒకే సెక్షన్‌లో ఉండేవాళ్ళం. అందరి కంటే నేను ఎక్కువగా చదువుకోవటంవల్లను, కొన్ని రోజుల్లో పనంతా నేర్చుకోవటంవల్లను హెడ్ క్లార్క్ కృష్ణయ్య ఆమె పని కూడా నన్ను చూడమనేవాడు. అంతకు ఆర్నెల్ల క్రితమే తను ఉద్యోగంలో చేరింది. . .ఆమె అంటే నా కెంతో ఇష్టం."

ఆయన చాలా సంతోషించాడు.

ఈ పదిహేనేళ్ళ కాలంలో నేను ఆమెను రెండు సార్లు మాత్రం కలిశాను. తర్వాత మూడు నాలుగు సార్లు వెళ్ళినా, కలవలేకపోయాను. రెండవసారి మాత్రం పదమూడేళ్ళ క్రితం చూశాను.

ఒక్కసారి చూడాలని . . . వీలయితే రేపే వెళ్ళాలని ఎందుకో అనిపించింది. అంతటి ఆరాటం నాలో కలిగింది.

ఆయన్ని భోజనానికి మా ఇంటికి ఆహ్వానించాను. మరోసారి వస్తానని మా ఇంటి అడ్రసు తీసుకొన్నాడు.

"అన్నపూర్ణను అడిగానని చెప్పండి" అన్నాను.

మరో పావు గంట తర్వాత సాంబశివరావు వెళ్ళిపోయాడు.




నాకు వివాహం అయింది. ఇద్దరు పిల్లలున్నారు. ఆమెను గురించి ఆలోచించటం, చూడాలనుకోవటం ఎందుకో తప్పుగా అనిపించదు నాకు. కారణం—ఆమె నన్నో మనిషిగా తీర్చి దిద్దింది. . .జీవితం అంటే ఏమిటో నేర్పింది. హెయిర్ స్టయిల్, చీర కట్టు వివరించింది. వస్త్రధారణ గురించి చెప్పేది. . .ఆమె నో మంచి స్నేహితురాలు.

అటువంటి స్నేహితురాలిని . . . ప్రేయసిని చూడాలనుకోవటంలో తప్పేముంది?

ఆమెకు పెళ్ళయింది. ఒక కూతురు ఉంది. కాని నేను వెళ్ళి కనబడితే అప్పటి అభిమానం, ఆప్యాయత కనబరుస్తుందా? మనుషులు దూరంగా

# మానవత్వం మేలుకొంది!

భరిడి వెంకటేశ్వర్లు

ఉంటే అభిమానం పెరుగుతుందట. ఇదెంతవరకూ నిజమో చూడాలి మరి.

సాంబశివరావు వెళ్ళిపోయినా, ఆమె గురించి ఆలోచిస్తూనే ఉన్నాను.

● ● ● ●

మరో నెల తర్వాత విజయవాడ వెళ్ళి అన్నపూర్ణను చూసే అవకాశం కలిగింది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారమ్ మీదకు ఇంకా రాలేదు. సినిమా స్టిల్సు, ప్రకటనలు, వచ్చే పోయే వారిని కాలక్షేపంకోసం చూస్తున్నాను.

పది నిముషాల తర్వాత ట్రెయిను వచ్చింది. ఎందుకో ఆ రోజు ట్రెయిను ఖాళీగా ఉంది. ఎదురుగా ఆగిన పెట్టెలోకి ఎక్కి కూర్చుని కిటికీ గుండా అవతల పక్క లైన్ల మీద వడుస్తున్న షంటింగు ఇంజన్లు, గూడ్సు బళ్ళను చూస్తుంటే, "ఏమండీ!" అన్న పిలుపుతో వెనక్కి తిరిగి చూశాను.

ఎదురుగా లాల్చీ, పంచె ధరించిన డెబ్బై ఏళ్ళ వృద్ధుడు, పన్నెండేళ్ళ అమ్మాయి నిలబడి ఉన్నారు.

ఆ అమ్మాయిని విజయవాడ తీసుకెళ్ళమని, ఎవరో ఒకరు వచ్చి స్టేషను నుంచి తీసుకు వెడతారని, ఎవరూ రాకపోతే—వెళ్ళే దారే కాబట్టి పూర్ణానందం పేట పోస్టాఫీసు దగ్గర దిగబెడితే, తను ఇంటికెళ్ళ గలదని—ఆయన మాటల్లోని సారాంశం.

అదేమంత భాగ్యం? అందులో నేను కష్టపడవల సిందేమీ లేదు. కేవలం తనకు సహాయం మాత్రమే. సరే అన్నాను. నా మీద నమ్మకంతో ఆయన వెళ్ళిపోయాడు.

ట్రెయిను బయలుదేరింది.

ఆ అమ్మాయి పేరు మాధవి. తల్లికి విజయవాడలో ఉద్యోగం. తండ్రి తమని వదిలేసి ఎక్కడికో వెళ్ళి పోయాడట. తను హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నదట. ఆ వచ్చినాయన ధూరపు చుట్టం—అంతకన్న వివరాలు మాధవి చెప్పలేక పోయింది.

ఈ దేశంలో అటువంటి జీవితా లెన్నో?

గతం నా కళ్ళ ముందు ఫ్లాష్‌లా మెరిసింది.

హైస్కూలు, కాలేజీ చదువుల్లో అమ్మాయిలతో ఏమాత్రం పరిచయం లేదు. నన్నా సెక్షన్‌లో పోస్టు చేశారు. నలుగురైదుగురు మగవాళ్ళ మధ్య నో అందమైన పారిజాతం, ముద్ద మందారం, పసుపు పచ్చని ముద్ద బంతి పువ్వు, చూపరులని ఇట్టే ఆకర్షించే, అందంతో మెరిసిపోయే ఇరవై ఏళ్ళ ముగ్ధ మోహిని, అతి లోక సుందరి! ఆమె పేరు అన్నపూర్ణ.

ఆఫీసు వాతావరణానికి అలవాటు పడ్డాక, ఒక రోజు సహోద్యోగితో వాదిస్తున్నాను—

"అసలీ ఆడవాళ్ళకు ఉద్యోగాలెందుకు? హాయిగా పెళ్ళి చేసుకొని, భర్త—పిల్లలతో కాలక్షేపం చేయకుండా ఎందుకీ జంజాటం? ఒక మూల నిరుద్యోగ సమస్య దేశాన్ని పీడిస్తుంటే, పురుషులతోపాటు ఈ ఆడవాళ్ళ పోటీ ఒకటి! ఏమిటో, రోజులు మారకపోయినా, మనుషుల్లో అలవాట్లు అభిరుచులు మాత్రం వెర్రితలలు వేస్తున్నాయి. అదేమంటే భార్యా భర్తలిద్దరూ ఉద్యోగం చేస్తేనే కాని ఇల్లు గడవదంటారు. . ."

నా వాదన అన్నపూర్ణ మన్నించక పోలేదు.

ఆమె చూపుల్లో ఏవో భావాలు, ముఖంలో రంగులు మారటం. . .నేను కూడా గమనించాను.

నాలుగు రోజుల తర్వాత లంచ్ అవర్లో ఆమె నా దగ్గర కొచ్చింది. ఆ సమయంలో మా సెక్షన్‌లో ఎవరూ లేరు.

"రామరావుగారూ! మొన్నటి మీ ప్రసంగానికి కాలేజీలో అయితే తప్పకుండా బహుమతి వచ్చేది. . . కాని ఇది ఆఫీసు—మీ దృష్టిలో ఆడదానికి ఉద్యోగం అనవసరం అనిపించవచ్చు! కాని, అందరూ ఉద్యోగాలు ఎందుకు చేస్తారో ఆలోచించలేదు. . .కొందరు కాలక్షేపం కోసం, కొందరు ఇల్లు గడవక. . .ఇలా ఎవరి కారణాలు వారివి. . .అనే ముందర ముందు వెనుక లాలోచించి అంటే బాగుంటుందేమో?" అంటూ ఏదో చెప్పబోయింది అన్నపూర్ణ.

ఆ చెమ్మగిల్లిన కన్నీటి వెనకాల ఏ విషాద గాథ ఉందో మరి! చెప్పలేకపోయింది. కూలరు దగ్గరకెళ్ళి రెండు గ్లాసుల నీళ్ళు తాగేసింది. బాత్‌రూములో ముఖం కడుక్కొని వచ్చింది.

"తను ఎందుకు ఉద్యోగం చేస్తున్నదో?" ఇంక నాకు అడగాలనిపించలేదు. ఆమె మనసు నొప్పించినందుకు చాలా విచారించాను.

పై సంఘటన తర్వాత మేమిద్దరం చాలా సన్నిహితులమయ్యాం. తనని 'మీరు' అనవద్దని చెప్పిందో రోజు.

మరో వారం రోజుల తరవాత—

నాకు విపరీతంగా జ్వరం వచ్చింది రెండు రోజులయినా జ్వరం నూట నాలుగు డిగ్రీల దగ్గరే ఉంది. ఇంట్లో అమ్మ, నాన్నలకు ఒకటే కంగారు. భయం

ఒక రోజు సాయంత్రం ఆరు గంటలకు అన్నపూర్ణ మా ఇంటికొచ్చింది మా అమ్మ నా మంచం పక్కనే ఉండి, తడి గుడ్డతో నుదుటి మీద రాస్తోంది.

కాకతాళీయంగా ఆమె నా నుదుటి పై చేయి వేసి చూసింది. అమ్మ విశ్రాంతి పోయింది లేచే ఓపిక లేకపోయినా, లేవాలని లేకపోయినా, ఆమె వద్దని వారిస్తున్నా గోడకు జార్లబడి కూర్చున్నాను

నాకు ఆశ్చర్యం వేసిన విషయం అది నా ఎదురుగా ఒక స్టూలు మీద కూర్చుని ఉందామె ఆ చూపుల్లో ఏ శక్తి ఉందో మరి నేనెంతో ఉపశమనం పొందినట్టు ఫీలయ్యాను

మరో రెండు రోజులకు నాకు జ్వరం పూర్తిగా తగ్గిపోయింది

● ● ● ●

ఆ రోజు లంచ్ అవర్లో ఇంటికి వెళ్ళినఅన్నపూర్ణ మూడు గంటలయినా రాలేదేమాఅని ఆలోచిస్తుంటే, వాళ్ళ పని పిల్ల వచ్చి, "మా అమ్మగారు మిమ్మల్నొకసారి వెంటనే రమ్మన్నారు. . .ఆవిడకు ఒళ్ళు కాలింది" అని చెప్పి వెళ్ళిపోయింది.

వెంటనే వాళ్ళింటికి బయలుదేరాను.

"తను కిరోసిన్ స్టవ్ వెలిగించి, అగ్గి పుల్ల క్రింద పడేస్తే, ప్రక్కనున్న కొబ్బరి పీచు రాజుకుని, ఆమె నైలాన్ చీర అంటుకోగానే, కెవ్వున అరిచింది. నేను వెంటనే వచ్చి చూసి చీర వూడదీశాను" అంటూ చెప్పింది, ప్రక్క వాటాలో ఉంటున్నావిడ.

అన్నపూర్ణ మంచం మీద పడుకొని ఉంది. శరీరం మీద పలచని చీర కప్పి ఉన్నారు.

"కాలిన గాయాలు చూడవచ్చా?" అన్నట్టు ఆవిడకేసి చూశాను. సమాధానం రాకముందే నేను చీర తొలగించి చూశాను.

మోకాళ్ళ కింద. . .తొడల మీద. . .అరచేతుల మీద కాలిన బొబ్బలున్నాయి. ఏం చేయాలో తెలియక కాబోలు గాయాల పైన సిరా రాశారు.

పాపం, అదృష్టవంతురాలే! ముఖం మీద, చాతీ మీద కాలితే? లేచిన వేళ బాగుంది.

వెంటనే దగ్గర్లో ఉన్న మందుల షాపుకెళ్ళి "బర్నాల్" కొని తెచ్చాను.

"ఆ గాయాల పైన రాయండి" అన్నాను ఆవిడతో.

"అమ్మో! నాకు భయం. . .మీరు రాయండి. పరవాలేదు. . ." నవ్వుతూ అం దావిడ.

"సిరా రాశారు కదా—భయమెందుకు;"

రెండు నిమిషాలు ఆలోచించాను.

ఆమె చీరను నెమ్మదిగా తొలగించి, కాలినపైపు

చూపింది. నేను బర్నాల్ రాయసాగాను.. .మొత్తం మీద మందు రాయటం పూర్తి అయింది. కొంచెం దూరంలో వో రైల్వే డాక్టరుంటున్నాడు. ఆయన్ని తీసుకొచ్చి చూడమన్నాను.

'హాస్పిటలైజేషను' అవసరం లేదని ఇంజక్షను చేసి మందులు రాసిచ్చాడు.

నెల రోజుల్లో గాయాలు పూర్తిగా మానాయి.

ఈ సంఘటనతో మేము మరింత దగ్గరయాము.

ఒకదాని తరవాత మరొక సంఘటన! అన్నపూర్ణ అంటే మరింత ప్రేమ ఏర్పడింది నాకు!

ఆమెను వివాహం చేసుకొంటే? అందుకు కారణం—తను ఉద్యోగస్తురాలు అని, అందగత్తె అని కాదు.

ఆమెలోని మంచితనం, సౌశీల్యం, నడవడి!

నా ఉద్దేశం అమ్మా, నాన్నలకు చెప్పాను.

"భార్యా రూపవతీ శత్రు అన్నారు. పైగా ఆమె ఉద్యోగం చేస్తుంది. . .ఆ అందం నీ జీవితం మీద ఎప్పుడైనా దాడి చేయవచ్చు. . .మా వివాహాన్ని మేము ఆమోదించలేం!" అన్నారు.

తల్లితండ్రుల ప్రాపకంలో పెరగటంవల్ల, వారిని ఒప్పించి, ఎదిరించే ధైర్యం లేకపోయింది. కాని ఈ విషయాన్ని ఆమెకు చెప్పలేదు. . .అయితే నా ధోరణి తను గ్రహించకపోలేదు.

తరుచు ప్రేమ వివాహాలు, ప్రేమ కథల గురించి తను నాతో మాటల మధ్యలో అంటుండేది. ఆమెను వివాహం చేసుకొంటే కలిగే లాభాలకన్న, తల్లి తండ్రులని ఎదిరించటంవలన కలిగే నష్టాలే ఎక్కువగా కనబడ్డాయి నాకు.

• • •

రైలు మార్గానికి ఇరువైపులా ఉన్న టెలిగ్రాఫ్ స్తంభాలని, కొండలని, చిన్న చిన్న రైల్వే స్టేషన్లని దాటుకుంటూ కృష్ణా ఎక్స్‌ప్రెస్ దూసుకుపోతూంది.

ఖమ్మం స్టేషన్‌లో టికెట్ ఎగ్జామినర్ మా పెట్టెలోకి ఎక్కి, టిక్కెట్లు చెక్ చేస్తూ మా దగ్గర కొచ్చాడు.

నేను టికెట్ చూపించాను. తరవాత మాధవిని అడిగాడు. ఆమె సంచీలో చూస్తే ప్లాట్‌ఫారమ్ టికెట్ కనిపించింది.

నా కాశ్చర్యం వేసింది, ఈ టికెట్ తీసుకొందేమిటా అని!

"అంకుల్! సికింద్రాబాద్‌లో తాతయ్య నాకు, తనకు టిక్కెట్లు కొన్నారు. . . హడావిడిలో, పొరపాటున ఆ టికెట్ తీసుకెళ్ళిపోయేరేమో?" గాభరాగా అంది. బిక్క మొఖం పెట్టిందామె. టికెట్ లేదని పెనాల్టీ కట్టమన్నాడు టి. టి. ఇ.

టికెట్ లేదని ట్రెయిను దింపేయవచ్చు! పాపం, ఆడపిల్ల. ఏం అవస్థ పడుతుంది? నేనెటూ తనతోపాటు వెడుతున్నాను కదా—వాళ్ళింటి దగ్గర డబ్బు అడిగి తీసుకోవచ్చు నన్న ఉద్దేశంతో, నేనే పెనాల్టీ కట్టేశాను. టికెట్ ఎగ్జామినర్ రశీదు రాసిచ్చాడు.

మాధవి తన దగ్గరున్న అయిదు రూపాయలు ఇవ్వబోయింది.

వద్దని వారించాను.

• • •

ఆలోచనల మధ్య మరి కొన్ని జ్ఞాపకాలు.

అన్నపూర్ణకు ఇద్దరు అక్కయ్య లున్నారు. తల్లి తండ్రులు లేరు. మేనమామే వారిని చేరదీసి పెద్దవాళ్ళని చేశాడు. ఆమె అక్కయ్య లిద్దరూ కాలేజీ చదువుల్లోనే ఎవరినో ప్రేమించి పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయారు. చెల్లెలు సంగతి వాళ్ళు పట్టించుకో లేదు.

స్కూలు ఫైనల్ పాసవగానే ఆమె మేనమామ రైల్వేలో ఎవరినో ఆశ్రయించి గుమాస్తా ఉద్యోగం వేయించి ఒక బతుకు తెరువు చూపించాడు.

• • • •

కాలం గడుస్తూంది, ఎవరి ప్రమేయంలేకుండానే!

ఒక రోజు మేనమామ నుంచి అర్జంటుగా బయలుదేరి రమ్మనమని టెలిగ్రాం వచ్చింది. ఎందుకో అని ఆమె వెళ్ళిపోయింది.

తను ఇరవై రోజులదాకా తిరిగి రాలేదు.

ఆమె వచ్చేసరికి నేను సెలవులో ఉండటం, తను వెళ్ళిపోయాక నేను డ్యూటీలో చేరటం జరిగి పోయాయి. ఆ రోజు నేను ఆఫీసుకు రాగానే హెడ్ క్లార్కు ఒక వార్త చెప్పాడు.



NDE. 36.82. TEC

"అన్నపూర్ణకు పెళ్ళయిందోయ్! నీకు తెలీదా? మాకు చెప్పకపోయినా, నీ కెందుకు చెప్పలేదో? ఇంకా ఎందుకు దాచటం?" వెటకారం ధ్వనించింది ఆ మాటల్లో.

ఆయన మాటల్లో యదార్థం లేకపోలేదు. అప్పటికే ఆఫీసులో మా గురించి రకరకాల వదంతులు ప్రచారంలో. ఉన్నాయి.

తను ఎందు కింత తొందర పడింది? నాతో ఎందుకు చెప్పలేదు? ఏవో సందేహాలు.. అనుమానాలు.

అప్పటినుంచీ రోజులు యుగాల్లా గడవసాగాయి.

నాలుగు రోజుల తరవాత అన్నపూర్ణ లంచ్ అవర్లో నాతో చెప్పింది.

"నన్ను నమ్మండి. ఇదంతా మా మామయ్య చేసిన మోసం. తక్కువ కట్నానికి వచ్చారని ఒక అనామకుడిని నాకు కట్టబెట్టాడు. పైగా బంధువుల చేత చెప్పించాడు. కాదనలేక పోయాను. కనీసం అక్కయ్యలకుకూడా తెలీదు."

పోతారు.

ఆమె శ్రేయస్సు కోరి, అప్పటినుంచీ పేపర్లో కనబడ్డ ప్రతి ఉద్యోగానికి అప్లయి చేసేవాడిని.

ఆమె అదృష్టం బాగుండి, ఎనిమిది నెలల తరవాత నాకు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం లభించింది.


కొత్త ఉద్యోగంలో చేరిన ఏడాదికి అన్నపూర్ణ జీవితం ఎలా ఉందో తెలుసుకోవా లనిపించింది.

కాని తన దాంపత్య జీవితంలో ఏ మార్పూ లేదని చెప్పిం దామె. నే నెంతో కుమిలి పోయాను.

ఆమె కోసం తన భర్త కోరినట్లుగా ఉద్యోగం, ఊరు మారాను. అయినా మార్పు లేదంటే నే నేం చేయాలో మరి?

ఆ రోజు ఆమెతో మాట్లాడేందుకు అయిదు నిమిషాలు మాత్రం వీలయింది.

రెండేళ్ళ తరవాత వాల్తేరు వెడుతూ అన్నపూర్ణను చూసేందుకు విజయవాడలో దిగి ఆఫీసుకు వెళ్ళాను.




రోజులు గడుస్తున్న కొద్దీ తన భర్త ఒక తాగుబోతు, వ్యభిచారి, జూదగాడు అని తెలిసింది. తనకు కావలిసింది పొందేందుకు రాత్రిపూట ఎప్పుడో వచ్చి వెళ్ళి పోయేవాడు.

తరుచు డబ్బు కోసం వేధించే వాడు. ఇవ్వకపోతే చావ బాదేవాడు. ఆమె ఏమీ చేయలేకపోయేది.

క్రమంగా మా గురించి ఆమె భర్తకు ఎవరో చెప్పారు.

ఒక రోజు వెల్‌కమ్ హోటలు దగ్గర అన్నపూర్ణ భర్త కలిశాడు.

"నువ్వు నా భార్య పని చేసే సెక్షన్ నుంచి వెళ్ళిపోవాలి. ఈ ఊరు వదిలి పోతే మరీ మంచిది. కారణం నీకే తెలుసు. ఆలోచించుకో! ఆ తరవాత నీ ఇష్టం!" హెచ్చరించి వెళ్ళిపోయాడు అతను.

అతని మాటల్లో ఎంతో యధార్థం ఉంది.

అవును! నేను తనకు కనపడకూడదు. నేను ఎదురుగా ఉంటే తను భర్తని లక్ష్య పెట్టక పోవచ్చు! నా మోజులో పడిపోతుందేమో? నేను మరో ఉద్యోగం చూసుకుని, వేరేవూరు వెళ్ళిపోవాలి. నేను దూరంగా ఉంటేనే ఈ జనం నన్ను మరిచి

మాటల మధ్యలో "నాకో కూతురు" అని చెప్పిం దామె.

"చాలా సంతోషం. ఇంతకీ మీ సంసారం ఎలా నడుస్తోంది? మీ వారిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఉద్యోగం దొరికిందా?" అడిగాను.

అన్నింటికి సమాధానంగా తను తల అడ్డంగా ఊపింది. కూతురుని చూసేందుకు ఇంటికి ఆహ్వానించింది. మనసులో వెళ్ళాలని ఉన్నా వెళ్ళలేక పోయాను. పది రూపాయల నోటు తీసి, ఆమె చేతిలో పెట్టి అమ్మాయికి ఏదైనా కొనివ్వమని చెప్పాను. ఆ రోజు నా కెంతో సంతోషం కలిగింది.

కాల ప్రవాహంలో రోజులు ... వారాలు ... నెలలు ... ఏళ్ళు దొర్లిపోయాయి.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ చేరగానే నా ఆలోచనలకు అంతరాయం కలిగింది.

స్టేషనులో పది నిముషాలు ఎదురు చూశాను, వార్తనికోసం ఎవరైనా వస్తారేమోనని. ఎవరూ రాకపోయేసరికి నేను తనని తీసుకొని పోస్టాఫీసు దగ్గర వదలి, డివిజనల్ ఆఫీసు వైపు నడిచాను.

దాదాపు పన్నెండేళ్ళ తర్వాత వెళ్ళటం వల్ల కాబోలు ఆఫీసులో అన్నీ కొత్త ముఖాలు... అక్కడక్కడ పాత ముఖాలు ... వయసు తెచ్చిన మార్పులతో!

పది నిముషాలు ఆఫీసంతా అన్నపూర్ణ కోసం చూశాను. ఆమె జాడ తెలియలేదు. ఎవరి నడగాలి? అనుకొంటూనే సాంబశివరావుకోసం చూస్తుంటే, ఆయనే మెట్లు ఎక్కి పైకి వస్తున్నాడు.

రెండు నిముషాలు కబుర్లు చెప్పుకున్నాక— "రాఘవరావుగారూ! మీ కొక విచారకరమైన వార్త చెప్పేందుకు బాధగా ఉంది" అన్నాడు.

నా గుండె ఓ నిముషం విశ్రాంతి పొందిందేమో!

"అలా క్యాంటీనుకు వెళ్ళి మాట్లాడుకొందాం— రండి" అంటూ సాంబశివరావు అటువైపు నడిచాడు.

నేను ఆయన్ని అనుసరించాను.

సాంబశివరావు చెప్పసాగాడు.

"ఏం చెప్పమంటారు? ఆవిడ జీవితం పూర్తిగా చితికిపోయింది. ఆమె భర్త గురించి తెలుసుకదా... ఖరవై నాలుగ్గంటలూ 'మందు' ఉండాలి. ఒకరోజు అలాగే ఆఫీసుకు వచ్చి భార్యని వేధించసాగాడు. మే మందరం అతన్ని ఇంటికి తీసుకుపోయాం. ఇదీ పరిస్థితి!

"మీ దగ్గర్నుంచి వచ్చిన తరవాత తనకు అంతా వివరించాను. తనెంత సంతోషపడిందో చెప్పలేను. ఆ తరవాత వారం రోజులకు భర్త వచ్చి అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలన్నాడట. తను ఇవ్వకపోతే తిరగబడి మెడలోని గొలుసు లాక్కొని వెళ్ళిపోయాడట. ఆ సంఘటన ఆమె మనస్సుపై తీవ్రంగా పనిచేసింది. జీవితంపై విరక్తి కలిగింది.

భర్తకోసం కాకపోయినా, కన్న కూతురుకోసం ఆమె తపించసాగింది. కూతురు జీవితం వెన్నెల మయంగా తీర్చిదిద్దాలనే ఆమె ఆరాటం. అందుకే హైదరాబాద్‌లో తన మేనమామ సహాయంతో హాస్టల్లో పెట్టి చదివిస్తోంది.

మీరంటే ఇప్పుడు కూడా ఎంత అభిమానమో చెప్పలేను. అందుకే తన కూతురుని మీ కప్పగించి మంచి భవిష్యత్తు కలిగించేందుకు వీలుగా తన స్వార్జితం మీ పేరున రాసి 'విల్లు' రిజిస్టరు చేయించింది.

ఇదంతా నా కో రోజు ఆఫీసులో చెప్పింది. నన్నొక తండ్రిగా భావించి, ఈ ఉపకారం చేయుమని అభ్యర్థించింది.

మీతో చెప్పవలసిన విషయాలు చెప్పింది. తాగుబోతు మనిషికి భార్య, పిల్లల అవసరం లేదు. చివరికి మూడు రోజుల క్రితం తన జీవితాన్నే బలి చేసుకునేందుకు సిద్ధపడింది.

ఇప్పు డామె రైల్వే హాస్పిటల్లోనే ఉంది—చూసి రండి." సాంబశివరావు చెప్పటం ముగించారు.

• • •

పరుగులాంటి నడకతో రైల్వే హాస్పిటల్ చేరాను 'స్త్రీల ప్రత్యేక వార్డు' వైపు వెళ్ళాను.

అన్నపూర్ణ బెడ్ నంబరు నర్సు చెప్పింది.

నా ఆశ్చర్యం ఏమని చెప్పను? అక్కడ మాధవి

కూడా ఉంది. మాధవి ఆమె కూతురు కాదు కద?

ఆమె పరిస్థితి, ఆ దృశ్యం నాకెంతో భయం కలిగించింది. నా కళ్ళ వెంట అప్రయత్నంగానే కన్నీరు! దుఃఖం దిగమింగుకునేందుకు ప్రయత్నించాను. ఆమెను చూడాలని, మాట్లాడాలని వస్తే ఇదా తన పరిస్థితి! ఇందుకా నేను ఆరాట పడింది!

దేవుడిపై నాకు కోపం వచ్చింది.

నాలుగు రోజుల క్రితం గ్యాస్ స్టవ్ ప్రమాదానికి అన్నపూర్ణ గురయింది. డబుల్ విస్కోస్ చీర సెకన్లలో అంటుకొని, ఒళ్ళంతా మంటల్లో అంటుకొంది. వూహించలేని పరిస్థితిలో చుట్టు ప్రక్కల వాళ్ళు రైల్వే హాస్పిటల్‌లో చేర్పించారు.

ఆ ఉదయమే భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. అప్పుడే భర్త చేతిలో చనిపోవలసింది. కాని అలా జరగలేదు. వెంటనే నాకు ఉత్తరం రాసి, మాధవికి టెలిగ్రామ్ ఇచ్చి, మరో రెండు గంటల తర్వాత గ్యాస్ స్టవ్ వెలిగించి తన చీరకు చొప్పించింది. ఆ మంటలకు వెంటనే మాట కోల్పోయింది.

శరీరంలో ఏ భాగం కనబడకుండా ఒళ్ళంతా కప్పబడి ఉంది. ముఖం మాత్రం కొద్దిగా కనిపించింది. వచ్చిన వారిని గుర్తించగలదు. ఆహారం లేదు... కేవలం సెలైను మాత్రమే!

నన్ను గుర్తించింది... "వచ్చారా!" అన్నట్లు అన్నపూర్ణ కళ్ళు చెమర్చాయి.

"చూశారు కదా! ఒకనాటి మీ ముద్దు మందారం స్థితి! ఇదంతా స్వయంకృతం అని ఎలా అనగలను?"

ఆమె కళ్ళలోని భావాలని నేను అర్థం చేసుకోగలను. తన కళ్ళద్వారా మాధవి చేతిని నా చేతిలో పెట్టింది

ఆ సమయంలో ఎప్పుడో తను చెప్పిన మాటలు .. ఏ నవల్లో నాయిక, నాయకుడు (ప్రియుడు) తో అన్నట్లుగా చెప్పినట్లుగా —

"మిమ్మల్ని పెళ్ళి చేసుకొన్నాక నేను ఉద్యోగం మానేస్తాను ... ఎందుకో తెలుసా? పగలంతా ఆఫీసులో చాకిరీ చేస్తే, రాత్రి శ్రీవారికేం సేవ చేయగలను? ఎలా తృప్తి కలిగించగలను? సాధ్యమైనంత త్వరలో మీ ప్రతిరూపంతో ఓ బాబుని కంటాను. మీరు ఆఫీసుకు వెడితే, వాడిలో మిమ్మల్ని మీరు వచ్చే వరకూ చూస్తుంటాను. అదే చాలు నాకు" అని.

ఆ కోరిక ఆ నాడు ఆ విధంగా నెరవేరలేదని, ఈ రోజు దేవుడు మాధవిని అప్పగిస్తున్నాడేమో? అనిపించింది.

సాంబశివరావుతో చెప్పిన విషయాలు, ఉత్తరం ద్వారా నాకు తెలియపరచిన సంగతులు అన్నీ ఆమె కళ్ళలోని భావాల ద్వారా తెలుసుకొన్నాను.

ఇంకా ఏవో చెప్పాలని ఆమె నోరు పెగలబోయింది. కాని ... చెప్పలేకపోయింది.

మళ్ళీ జన్మలో అయినా తన కోరిక నెరవేరగలదేమో?

"నా కూతురి బాధ్యత మీ కప్పగిస్తున్నాను — మా అక్కయ్య లెవ్వరూ దాని గురించి పట్టించుకోరు. నా భర్త సరేసరి ... దేవుడులా వచ్చారు మీరు ... నే నెంత అదృష్టవంతురాలిని! ఒకనాటి మీ ప్రేయసిని—మానవత్వం ఉన్న మంచి మనిషిగా నా స్థితి అర్థం చేసుకోండి!"

కూతురుమీద అభిమానం ... ప్రేమ ఉన్న అన్నపూర్ణ ఈ పనికెందుకు సాహసించిందో అర్థం కాలేదు. ముందుగా ఆమె భవిష్యత్తు వూహించలేదా? అంతా తెలిసే ఎందుకు చేసిందో అర్థంకాని సమస్యగానే మిగిలిపోయింది నాలో!

ఆమె మూగ వేదన తన కళ్ళద్వారానే వ్యక్తపరుస్తున్నట్లనిపించింది.

"అన్నపూర్ణా! మాధవిని గురించి అనవసరంగా బెంగపెట్టుకోకు! ఆమెకు నేను ప్రత్యేకంగా చేయవలసిందేమీ లేదు. అంతా నువ్వే ఏర్పాటు చేశావు కదా! ఆమె గురించి నీవింక నిశ్చింతగా ఉండు! నా పిల్లలతోపాటే చదువు చెప్పిస్తాను ... నీ కూతురుకు ఏ లోటు, ఇబ్బంది రాదని నా భార్య మాటగా హామీ ఇస్తున్నాను ..." ఎంతో విచారంతో అన్నాను ఆమె స్థితికి జాలిపడుతూ.

ఆమె ఎంతో సంతోషించినట్లుగా చెమర్చిన కళ్ళనుంచి వర్షించిన ఆనంద బాష్పాలే పలికాయి.

నా వాగ్దానంగా ఆమె చేతిలో చేయి వేసి, అనాలోచితంగా నుదురు నిమిరాను ... అన్నపూర్ణ కళ్ళు బరువుగా, శాశ్వతంగా మూసుకున్నాయి. మాధవిని బయట నిలబడమని చెప్పాను, భయపడనీయకుండా ఉండేందుకు.

• • •

మాధవిని తీసుకొని ప్లాట్‌ఫారమ్ మీదకు వెళ్ళాను. ఎదురుగా కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఉంది! ఇద్దరం ఎక్కేక బయలుదేరింది రైలు.

టెలిగ్రాఫ్ స్తంభాలు ... చెట్లు ... స్టేషన్లు స్వాగతం చెపుతూంటే రైలు వేగంగా, ఠీవిగా సికింద్రాబాదు వైపు పరుగుతీస్తోంది. ★


రుచికరమైన, శక్తిదాయకమైన,
భూటాన్ వారి డ్రక్

DRUK

స్క్వాష్, జ్యూసెస్, జామ్
టొమాటో కెచప్




భూటాన్ ఫ్రూట్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ సామ్చి - భూటాన్

(ట్రేడ్ లింక్స్ లిమిటెడ్ 17, రాజేంద్ర ప్లేస్, న్యూఢిల్లీ.

# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్య వ్యవహారాలకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం మీకు చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తిహక్కులు ఎవరితోనైనా ప్రమాదం రాబోతుంటే, పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ప్రభుత్వ ఉచిత యిండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసి పంపుకోవాలి, నోట్లు దస్తావేజులు, ఒప్పందాలు పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ: 12. పోష్టు ఖర్చు లదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా వీలయినంత త్వరగా పొందండి